
# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 13 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 155

తెలుగు దినపత్రిక


## తొలిపోరుకు సిద్ధం

- జార్ఖండ్‌లో మొదటి విడత పోలింగ్
- నవంబర్ 20 తేదీ రెండో విడత..
- 81 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎలక్షన్ కమిషన్



4

# పక్కా ప్లాన్..?!

## దాడి వెనక పట్నం



- కేటీఆర్ కు ఎప్పటికప్పుడు సమాచారం
- వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో విస్తుపోయే నిజాలు
- ప్రధాన నిందితుడికి గులాబీ నేతలతో సంబంధాలు
- ఘటనకు ముందు నుంచి మాజీ ఎమ్మెల్యేకు 43 సార్లు ఫోన్ కాల్స్
- నరేందర్ రెడ్డి నుంచి కేటీఆర్ కు ఫోన్లు..
- డేటా వివరాలు సేకరించిన పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో రెగ్యులర్ టచ్



**జనపదం, బ్యూరో:**

వికారాబాద్ లో జిల్లా కలెక్టర్ పై జరిగిన దాడి ఘటన ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అయితే ఈ ఘటన వెనుక అనేక అంశాలు వెలుగుచూస్తున్నాయి. కలెక్టర్ పై జరిగిన దాడి పూర్తిగా రాజకీయ వ్యూహంతోనే జరిగినట్లుగా పోలీసుల విచారణలో తేలుతున్నాయి. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. దీంతో పోలీసుల దర్యాప్తు సైతం శరవేగంగా జరుగుతోంది. దాడి ఘటనలో పలు షాకింగ్ విషయాలు బయటకొస్తున్నాయి. ప్రధానం కలెక్టర్ పై దాడి జరిగిన ఘటనలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ అగ్రనేతల కనుసన్నలోనే జరిగినట్లుగా తెలుస్తోంది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు ఈ ఘటనకు అసలు సూత్రధారుడిని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో మరింత లోతుగా పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో కలెక్టర్‌పై దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలం సేకరణ మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సోమవారం లగచర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. గ్రామస్తుల ముసుగులో బీఆర్ఎస్ కు చెందిన యూత్ వింగ్ నాయకులు ఎంటరై అధికారులపై దాడికి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ......(తరువాయి 2లో)



### తెలంగాణ తిరగబడుతోంది..

రాష్ట్రం తల్లడిల్లుతోంది..
ఎక్స్ వేదికగా కేటీఆర్
రేవంత్ సర్కార్ వైఫల్యాలపై ధ్వజం..

2



### రైతులకు గౌరవం ఇవ్వండి

వారి ఇష్టప్రకారమే భూసేకరణ జరగాలి
బలవంతంగా తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదు
ఎంపీ ఈటల రాజేందర్



### లగచర్ల దాడి ఘటనలో 55 మంది అరెస్ట్

పెన్ డౌన్ తో ఉద్యోగుల నిరసన
ఎవ్వరున్నా వదులొద్దు : ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి



## మీరేం చేశారు..?

- వారం నుంచి దాడికి ప్లానింగ్
- ప్రధాన నిందితుడి సమావేశాలను ఎందుకు గుర్తించలేదు
- పోలీస్ వ్యవస్థ కండ్లు మూసుకుందా..?
- కుట్రలు చేసింది బీఆర్ఎస్సే
- లగుచర్ల గ్రామస్థులను రెచ్చగొట్టింది వాళ్లే
- మంత్రి శ్రీధర్ బాబు సీరియస్
- ఘటనపై జిల్లా యంత్రాంగంతో సమీక్ష

2



## కాపాడు దేవుడా..

### పాపాత్ముడు రేవంత్ రెడ్డిని క్షమించు..

- మూసీ కంటే రేవంత్ నోటి కంపు ఎక్కువ
- రైతుల సీఎం కేసీఆర్.. బూతుల సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ లేకుంటే ఉద్యమం లేదు
- రేవంత్ కి సీఎం పదవే లేదు..
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్డుమీదకి వచ్చిండ్రు..
- ప్రజలు ప్రశాంతతను కోల్పోయారు..
- సీఎం పగ ప్రతీకారం పక్కనపెట్టి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- సంజయ్ యాత్రకు సంఘీభావం..

4


# 'ట్యాపింగ్' టెన్షన్..

- బీఆర్ఎస్ నేతల మెడకు ఉచ్చు
- ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు..
- తాజాగా మరో ముగ్గురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు..
- చిరుమర్తిని విచారించిన తర్వాత నలుగురి స్టేట్ మెంట్ రికార్డ్
- ఆరోగ్యం బాగోలేదన్న లింగయ్య
- పోలీసుల జాబితాలో ఇంకొందరు కీలక నేతలు
- అదనపు ఎస్పీ తిరుపతన్నతో టచ్ లో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు
- మలుపులు తీసుకుంటున్న విచారణ



**జనపదం, హైదరాబాద్ క్రైమ్**

గులాబీ నేతలకు ఫోన్ ట్యాపింగ్ భయం పట్టుకున్నది. గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు ఇప్పటికే చార్జిషీటు దాఖలు చేసి ఇప్పటి వరకు ఆ శాఖ అధికారులనే విచారించి వారి స్టేట్ మెంట్లను రికార్డ్ చేశారు. తాజాగా తొలిసారిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయడంతో ఈ కేసుపై విచారణ కీలక మలుపు తీసుకున్నట్లు అయింది. ఈ క్రమంలో నవంబర్ రెండో వారంలో తమ ఎదుట విచారణకు హాజరు కావాలని పోలీసులు తమ నోటీసుల్లో పేర్కొనడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కాగా ఈ నెల 11న తొలి నోటీసు అందుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఈ నెల 14న జూబ్లీహిల్స్ ఏసీపీ ముందు విచారణకు హాజరుకానుండగా ఆయన్ను విచారించిన రెండు మూడు రోజుల్లో మిగిలిన మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించాలని పోలీసులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు పోలీసుల జాబితాలో ఇంకొంత మంది బీఆర్ఎస్ కీలక నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. కాగా ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్న మరో నలుగురు మాజీ ఎమ్మెల్యేలతో టచ్ ఉన్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుంది..? ఏ నాయకుడు అరెస్ట్ అవుతారోననే టెన్షన్ గులాబీ కీలక నేతలతో పాటు క్యాడర్ నూ కలవరపెడుతున్నది. గత కొంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేపడుతోన్న పోలీసులు కీలక ఆధారాలు రాబట్టినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆచీతూచీ వ్యవహరిస్తోంది. అయితే ......(తరువాయి 2లో)



## సీఎం పోస్ట్ ఊస్ట్..?

- అమృత్ స్కాంతో రేవంత్ పదవి పోవడం ఖాయం..
- మంత్రి పొంగులేటి పదవికీ ప్రమాదమే..
- కాంగ్రెస్ కు ఏటీఎంగా తెలంగాణ
- రోజుకో స్కాం బయట పెడుతాం..
- నా మీద ఏ కేసు పెట్టినా భయపడా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఢిల్లీలో మీడియా సమావేశం..

**జనపదం, న్యూఢిల్లీ**

రాష్ట్రంలో జరిగిన అమృత్ స్కామ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల పదవులు పోవడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇలాంటి కేసుల్లో చాలా శక్తివంతులు కూడా గతంలో పదవులు పోగొట్టుకున్న దాఖలాలు ఉన్నాయన్నారు. ఈ స్కాం పైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, ఇతర రాష్ట్రాల ఎన్నికలకు ......(తరువాయి 2లో)

## రాష్ట్రంలో అధికార దుర్వినియోగం

- ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే డబ్బులు..
- తెలంగాణ, కర్ణాటకలో ఆర్ ఆర్ ట్యాక్స్ వసూల్
- ఇక్కడ మోసం చేసినట్టే.. మహారాష్ట్రలో కూడా..
- ముంబై ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

4



## పత్తి ధర పతనం..

- రైతుల మండిపాటు
- మార్కెట్ సందర్శించిన కలెక్టర్
- అధికారులపై ఆగ్రహం
- రైతుకు అన్యాయం చేయాలనుకోవడం సరికాదని హితవు..
- చర్యలకు వెనకాడబోమని హెచ్చరిక..



4



## బీఆర్ఎస్, బీజేపీ చీకటి బంధం..

అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టం..
సీఎం రేవంత్ రెడ్డి

4



తప్పించుకోవడానికే

## ఢిల్లీ టూర్..

విచారణ నుంచి బయటపడేందుకే కేటీఆర్ ఢిల్లీకి..
అయినా అక్కడ ఆయన్ను ఎవరూ దేఖరు..
ఢిల్లీలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

2



# సీఎం పోస్ట్ డౌస్ట్..?

**(మొదటిపేజీ తరువాయి)** తెలంగాణ ఏటీఎంగా మారిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ప్రధాన మంత్రి మహారాష్ట్ర ఎన్నికల్లో మాట్లాడడం కాదు జరిగిన అవినీతిపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అమృత్ టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదు అంటే అదే మాటను బీజేపీ నేతలు, ప్రధానమంత్రి దేశానికి చెప్పాలన్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఇది బీజేపీ చిత్తశుద్ధికి ఒక లిట్మస్ పరీక్ష అని గుర్తించాలన్నారు. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి, మంత్రుల కుటుంబ సభ్యులకే టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఇంత అవినీతి జరుగుతున్నా మౌనంగా ఉండడం చర్యలు తీసుకోకుండా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కేంద్రం స్పందించకపోయినా రాష్ట్రంలో జరుగుతున్న అనేక అవినీతి కార్యక్రమాల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని బీఆర్ఎస్ పక్షాన ఎండగడుతూనే ఉంటామన్నారు. క్రోనీ క్యాపిటలిజం గురించి ఢిల్లీలో మాటలు చెబుతున్న రాహుల్ గాంధీని ఎండగడతామన్నారు. అమృత్ టెండర్ల పైన ఫిర్యాదు చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి మనోహర్లాల్ కట్టర్ ఈ అంశంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కేటీఆర్ వెల్లడించారు.

## రెండు పార్టీలు కలిసే ఉన్నాయి..

రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ లు కలిసే ఉన్నాయని కేటీఆర్ అన్నారు. రేవంత్ పైన వచ్చే ప్రతి విమర్శకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించి కాపాడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది ఎంపిలున్నా ఇప్పటిదాకా 11 నెలలలో ఒక్కరు కూడా ప్రభుత్వ అవినీతిపైన మాట్లాడలేదన్నారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను గొర్రెల మాదిరి కొంటున్నారు అన్న మల్లిఖార్జున ఖర్గే తెలంగాణలోని గోట్ మందిని చూడాలని స్వాగతిస్తున్నానని అన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న గొర్రెల కొనుగోళ్లను చూడాలన్నారు. అసలు ఫిరాయింపులను మెదలు పెట్టిందే కాంగ్రెస్ అని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువ ఫిరాయింపులు తెలంగాణలోనే జరుగుతున్నాయని, ఖర్గే ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

## మహారాష్ట్రకు తెలంగాణ సొమ్ము..

మహారాష్ట్ర ఎన్నికల్లో రాహుల్ గాంధీ అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలకు తెలంగాణ సొమ్ములు పోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజల రూ 300 కోట్ల సొమ్మని మహారాష్ట్రలో అబద్ధాల ప్రచారానికి రేవంత్ సర్కార్ సాయం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలుకు నిధులు లేవంటున్న ప్రభుత్వం, చేయని హామీలు అమలుపైన ప్రచారం కోసం అడ్డగోలుగా వందల కోట్లతో ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో చేయని పనులు చేసినట్లు రాహుల్ గాంధీ చెబుతుండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పేపర్ ప్రకటనలోని ఒక్క హామీని కూడా కాంగ్రెస్ తెలంగాణలో నెరవేర్చలేదన్నారు, కానీ రాహుల్ అన్ని అమలు చేసినట్టు అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రజలు ప్రాంతీయ పార్టీలకే ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ కు బిజెపిని ఆపే శక్తి లేదన్నారు.

## నియోజకవర్గం ప్రజలకు విషం..

బావమరిది కోసం అమృత్ టెండర్ల ద్వారా అమృతం పంచుతున్న రేవంత్ రెడ్డి కొడంగల్ ప్రజలకు విషం పంచుతున్నారని విమర్శించారు. అందుకే కొడంగల్ ప్రజలను ఫార్మా కోసం లాఠీ చార్జీలు చేసి ఇబ్బందులు పెట్టి అరెస్టులు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. తన అల్లుడి ఫార్మా కంపెనీ కోసం రేవంత్ రెడ్డి కొడంగల్ ప్రజలను బలిపెట్టి భూములు లాక్కుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి అడ్డగోలు విధానాల పైన ధన దాహం పైన కొడంగల్ ప్రజలు చేసిన తిరుగుబాటు చేస్తున్నారన్నారు. పోలీస్ రక్షణ లేకుండా ముఖ్యమంత్రి కొడంగల్ పోయే పరిస్థితి లేదన్నారు. కలెక్టర్ ను కొట్టేపరిస్థితి తెలంగాణలో, ఏపీలో ఎప్పుడు జరగలేదన్నారు. ఒకవైపు కలెక్టర్ తనపై దాడి జరగలేదంటూ స్వయంగా చెప్తున్నప్పుడు మరి కేసులెందుకు, అరెస్టులెందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

## నాకేం భయం లేదు

నాపై ఎలాంటి కేసు పెట్టుకున్నా విచారణలు చేసుకున్న నాకేం భయం లేదని కేటీఆర్ అన్నారు. ఐదు వారాల కింద తెలంగాణ రెవెన్యూ మంత్రిపైన ఈడీ దాడులు చేసిందని అయితే దీనిపై ఇప్పటి వరకు ఈడీ కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. మంత్రి కూడా మాట్లాడలేదన్నారు. ఈడీ దాడి తర్వాత అదానీ వచ్చి అదే మంత్రితో చర్చలు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

# పక్కా ప్లాన్..?!

**(మొదటిపేజీ తరువాయి)** ఏరియా డెవలప్‌మెంట్ అధికారి వెంకట్‌రెడ్డిలపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో కలెక్టర్ తప్పించుకోగా, పలువురు అధికారులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ప్రస్తుతానికి 55 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసేలా జనాలను రెచ్చగొట్టిన సురేష్ అనే వ్యక్తిని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లుగా తెలుస్తోంది.



## 42 సార్లు సంభాషించిన సురేష్

జిల్లా కలెక్టర్‌తో పాటుగా పలువురు అధికారులను లగిచర్లకు తీసుకువెళ్లడంలో ప్రధానంగా సురేష్ వ్యవహరించినట్లుగా తేలింది. నిందితుడుగా ఉన్న సురేష్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తించారు. దాడికి కొన్ని గంటల ముందు నరేందర్ రెడ్డితో 42 సార్లు మాట్లాడాడు. ఓ వైపు సురేష్‌తో మాట్లాడుతూ మరోవైపు 6 సార్లు కేటీఆర్‌తో ఫోన్ లో పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడినట్లు కాల్ డేటా ప్రకారం తేలింది. దీంతో దాడి ప్లాన్ ప్రకా ర మే జరిగినట్టు తెలుస్తోంది. ఇక, సురేష్‌పై ఇప్పటికే రేప్ కేసుతో సహా పలు కేసులున్నాయి. చెల్లి వరస అయ్యే అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడినందుకు రేప్ కేసు నమోదైంది. ఆయనపై కేసులు తొలగించేలా పట్నం సహాయం చేసినట్టు తెలుస్తోంది.ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్ తో పాటు అధికారులపై దాడికి జనాల ను సురేష్ రెచ్చగొట్టినట్లు పోలీసులు గుర్తించారు.

## స్వచ్ఛందంగా ఇచ్చారా..?

వికారాబాద్ జిల్లా లగ్గిచర్లలో ఫార్మా విలేజ్‌పై అభిప్రాయ సేకరణ ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా కలెక్టర్‌పై స్థానిక ప్రజలు దాడి చేయడం కలకలం రేపింది. అంతే కాదు కలెక్టర్, అధికారులకు సంబంధించిన మూడు కార్లను ప్రజలు ధ్వంసం చేశారు. ఈక్రమంలో గ్రామంలో తీవ్ర హైటెన్షన్ వాతావరణం నెలకొంది. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోని లగ్గిచర్ల, పోలేపల్లి, హీకంపేట మూడు గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేసేందుకు మూడు వేల ఎకరాల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు భూములను స్వచ్ఛంధంగా ఇచ్చేశారు. అయితే లగ్గిచర్ల గ్రామంలో ముందుగా ప్రజాభిప్రాయసేకణ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో తాత్కాలిక సభను నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించాగా.. అందుకు గ్రామస్తులు నిరాకరించారు. దీంతో కలెక్టర్, రెవెన్యూ అధికారులు గ్రామంలోకి వచ్చి ప్రజలతో మాట్లాడేందుకు యత్నించారు. ఇంతలోనే ఊహించని ఘటన చోటు చేసుకుంది. కలెక్టర్‌పై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

## కీలం కానున్న ఏడీజీ నివేదిక..

దాడి ఘటనలో ఏడీజీ నివేదికే అత్యంత కీలకం కానుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని తెలుస్తుంది. అలాగే దోషులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం గట్టిగా నిర్ణయించినట్లు సమాచారం. అందులో భాగంగా మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుతో వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐజీ సమాశమయ్యారు. సోమవారం దాడి ఘటనపై వారి నుంచి మంత్రి శ్రీధర్ బాబు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## లగచర్ల దాడి ఘటనలో 55 మంది అరెస్ట్

### పెన్ డౌన్‌తో ఉద్యోగుల నిరసన

### ఎవ్వరున్నా వదులొద్దు

### ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి



**జనపదం, వికారాబాద్ :** ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ కోసం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన గ్రామసభలో వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ తో పాటు కొడంగల్ డెవలప్ మెంట్ అథారిటీ(కడ) ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పై గ్రామస్తులు దాడికి ప్రయత్నించిన విషయం విదితమే. ఘటనలో ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డికు తీవ్ర గాయాలు కావడంతో పాటు కలెక్టర్ ప్రత్యేక అధికారి కార్లను కట్టెలతో అల్లరి మూకలు ధ్వంసం చేశాయి. దాడి నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ తప్పించుకున్నారు. దీంతో లగచర్ల గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టర్ అదనపు కలెక్టర్లపై దాడికి ప్రయత్నించిన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం మంగళవారం కార్యాలయం ఎదుట పెన్ డౌన్ సమ్మెను నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఘటనలో పోలీసులు 55 మందిని అరెస్టు చే శారు. దుద్యాల, కొడంగల్, బోంరాస్పేట మం డలాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. బీఆ ర్ఎస్ పార్టీ అగ్ర నాయకులు కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఇతర నాయకులు రైతుల అరెస్టులను ఖండించారు. అయితే లగచర్లలో అధికారులపై దాడి ఘటనకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కారణమని కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు మనోహర్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి ఆరోపించారు. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కూడా వికారాబాద్ లో మీడియాతో మాట్లా డు తూ అధికారులపై దాడి ఘటన తీవ్రంగా ఖం డించారు. దాడులకు పాల్పడిన వారిలో బీ జేపీ వారు ఉన్న అరెస్టు చేయాలని పేర్కొనడం విశేషం.

# మీరేం చేశారు..?

- వారం నుంచి దాడికి ప్లానింగ్
- ప్రధాన నిందితుడి సమావేశాలను ఎందుకు గుర్తించలేదు
- పోలీస్ వ్యవస్థ కండ్లు మూసుకుందా..?
- కుట్రలు చేసింది బీఆర్ఎస్సే
- లగుచర్ల గ్రామస్తులను రెచ్చగొట్టింది వాళ్లే
- మంత్రి శ్రీధర్ బాబు సీరియస్
- ఘటనపై జిల్లా యంత్రాంగంతో సమీక్ష

**జనపదం, బ్యూరో:** వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. లగచర్ల గ్రామంలో కలెక్టర్ పై జరిగిన దాడికి అధికారుల వైఫల్యమే కారణం అని అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మంగళవారం మంత్రి శ్రీధర్ బాబుతో కలెక్టర్, ఎస్పీ, ఐజీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. గ్రామస్థులను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత జరుగుతుంటే పోలీస్ వ్యవస్థ కండ్లు మూసుకుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కుట్రను పసిగట్టడంలో ఇంటిలిజెన్స్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల నుండి గ్రామస్తులతో భేటీ అవుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారని సమాచారం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిందన్నారు. పది నెలలుగా ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. లగుచర్ల గ్రామస్థులను రెచ్చగొట్టింది బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఇక్కడికి ఫార్మా పరిశ్రమ వస్తే 10 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరైనా నిరసన తెలపవచ్చని, కానీ లా అండ్ ఆర్డర్ ను చేతుల్లోకి తీసుకుని దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. దాడులు చేయడం వల్ల ఉద్యోగులు ఏ పని చేయడానికి ముందుకు వెళ్లరని, దాని వల్ల ప్రజలకే నష్టమని హెచ్చరించారు. దాడి వెనుక ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్టు తెలిపారు. పోలీసులు ప్రతి ఉద్యోగికి రక్షణ ఇవ్వడమనేది సాధ్యం కాదని ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## తెలంగాణ తిరగబడుతోంది..

- రాష్ట్రం తల్లడిల్లుతోంది..
- ఎక్స్ వేదికగా కేటీఆర్
- రేవంత్ సర్కార్ వైఫల్యాలపై ధ్వజం..



**జనపదం, బ్యూరో:** పదకొండు నెలల రేవంత్ పాలనలో యావత్ తెలంగాణ తిరగబడుతోందని ఆందోళనలతో రాష్ట్రం తల్లడిల్లుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ పాలనపై నిప్పులు కురిపించారు. ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం కాకుండా రేవంత్ రెడ్డి కేవలం తన కుటుంబ సభ్యులను ఆర్థికంగా పెంచిపోషించడానికే పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. అందుకే ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతున్నారని అన్నారు. కుటుంబ దాహం కోసం రేవంత్ తన ప్రాంతంపై కుట్రలు చేస్తే లగచర్ల లాగయించి ఎదురొడ్డుతుందన్నారు. మా భూములు మాకేనని కొడంగల్ కొట్లాడుతుందన్నారు. పసలేని, పనికిరాని పాగల్ పాలనలో తెలంగాణ ఆగమైతుందని వ్యాఖ్యానించారు. అసమర్థ మూర్ఖ ముఖ్యమంత్రి ఎలుబడిలో రాష్ట్రంలో కొంతకాలంగా కొనసాగుతున్న అసంతృప్తులివన్నారు. ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర కోసం రైతన్నలు రోడ్డెక్కుతున్నారన్నారు. హైడ్రా' దౌర్జన్యాల పట్ల సర్కారుపై జనం తిరుగుబాటు చేస్తున్నారన్నారు. మూసీలో ఇండ్ల కూల్చివేతలపై బాధితులు దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసనలు, ఉపాధి దూరంచేసిన అసమర్థ ప్రభుత్వంపై నేతన్నల ధిక్కారం, ఆర్థిక సాయంతో ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల మహాధర్నాలు, గ్రూప్స్ పరీక్షల నిర్వహణ తీరుపై భగ్గుమన్న విద్యార్థి లోకం, ఫార్మా కోసం భూములు లాక్కోవద్దని అన్నదాతల కన్నెర్ర, కులగణనలో అడుగుతున్న ప్రశ్నలపై అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి, గురుకులాల్లో అవస్థల పరిష్కారానికి రోడ్డుపై విద్యార్థుల బైఠాయింపు వంటి నిరసన కార్యక్రమాలతో రాష్ట్రం అట్టుకుడుకుతోందన్నారు.

# 'ట్యాపింగ్' టెన్షన్..

**మొదటిపేజీ తరువాయి)** పోలీసుల విచారణ నీరుగారిందనే ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ కేసు విషయంలో కీలక పరిణామ చోటు చేసుకున్నది.

## ఐదుగురికి నోటీసులు..

ఈ కేసులో విచారణను ముమ్మరం చేసిన పోలీసులు ఇటీవల నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం మరో నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాలను కుదిపేసింది. వీరిలో ఉమ్మడి నల్గొండ, వరంగల్, మహబూబ్ నగర్ కు చెందిన ముగ్గురు మాజీ మంత్రులు ఉన్నట్టు సమాచారం. వీరందరూ గత ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నేతలకు సంబంధించిన డబ్బును సీజ్ చేసే విషయంలో అన్నీ తామై వ్యవహరించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. తమ అధికారంతో ప్రతిపక్ష నేతల ఫోన్లు టాప్ చేయాలని పోలీసులను ఆదేశించి వారితో కథ నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించి అరెస్టయిన పోలీసు అధికారులు ఈ కేసు విచారణలో అన్ని విషయాలు బయటపెట్టినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ తో పాటు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు పోలీస్ వాహనాల్లో డబ్బులు సైతం వెళ్ళినట్లు చార్జిషీట్ లోనూ దర్యాప్తు అధికారులు పేర్కొన్నా రు. అయితే ఇప్పుడు నోటీసులు అందుకున్న మాజీ ఎమ్మెల్యేలే పోలీసుల సహాయంతో డబ్బుల సంచులను ఎన్నికలకు తరలించినట్టు పోలీసులకు ఆధారాలు లభించాయి. దాంతో వీరి స్టేట్‌మెంట్ రికార్డ్ చేయడంతో పాటు వీరి పాత్ర పైనా పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ క్రమంలో వీరికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. ఇదీలావుంటే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన తిరుపతన్నతో చిరుమర్తి లింగయ్య జరిపిన ఫోన్ సంభాషణల నేపథ్యంలో పోలీసులు ఆయన్ను విచారణకు పిలిచారు. అయితే తనకు ఆరోగ్యం బాగాలేదనీ అందుకే ఈ నెల 14న విచారణకు రాలేనంటూ లింగయ్య పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.



## పోలీసుల చేతికి కీలక సమాచారం..

ఫోన్ ట్యాపింగ్ కేసులో చాలామంది బీఆర్ఎస్ లీడర్లకు సంబంధాలు ఉన్నాయని విచారణలో తేలింది. కేసులో నిందితులైన ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న స్టేట్మెంట్ల ఆధా రంగా పోలీసులకు పలు విషయాలు తెలిశాయి. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేసి సమాచారం సేకరించారని, దాన్ని బీఆర్ఎస్ నేతల కు అనుకూలంగా వాడుకున్నారని తెలుసుకున్నారు. అందుకే ప్రణీత్ రావు ఆధారాలు దొరకకుండా హార్డ్ డిస్కులను ధ్వంసం చేసినట్టుగా గుర్తించారు. విచారణ సందర్భంగా మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్, శ్రీనివాస్ గౌడ్, జగదీష్ రెడ్డి పేర్లు బయటకు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల సమయం లో పాలకుర్తి, నల్గొండ, మహబూబ్‌నగర్‌లో వార్ రూమ్ లను ప్రణీత్‌రావు ఏర్పాటు చేశాడు. ఎర్రబెల్లికి పోటీగా నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేశాడు. ఒక్క పాలకుర్తిలోనే కాదు, ఇతర ప్రాంతాల్లోనూ ప్రణీత్ రావు వార్ రూమ్స్ ఏర్పాటు చేశాడు. కాంగ్రెస్ నేతల మూవ్‌మెంట్స్ తెలుసుకునేందుకు ఫోన్ ట్యాపింగ్‌ను గట్టిగా వాడేశారు. అప్పటి ప్రతిపక్ష నేతలు ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవర్ని కలుస్తున్నారు, ఇలా సమాచారమంతా తెలుసుకుంటూ కథంతా నడిపించారు. మహబూబ్ నగర్, నల్గొండ కాంగ్రెస్ నేతల ఫోన్స్ ట్యాప్ చేసేందుకు నల్గొండలోని ఓ ఉడిపి హోటల్‌పైన పెట్టిన వార్ రూమ్‌ను ప్రభు త్వం మారాక కూడా కొనసాగించారు. మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌కు కీలక సమాచారం వెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూరల్ బెల్ట్ పై ఫోకస్ చేసిన పోలీసులు, ఈ ముగ్గురు మాజీ మంత్రుల తో పాటుగా నల్గొండ జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

## ప్రభాకర్ రావు చెబితేనే..?

ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రమేయం ఉన్నట్టు తేలిన పోలీస్ అధికారులను మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇంటలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకున్నారు. అయితే కేసు విచారణలో భాగంగా ఇది వరకే ప్రభాకర్ రావుకు ఫోన్ చేసిన పోలీసులు ఆయన నుంచి కీలక సమాచారం రాబట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. అయితే ఇప్పటి వరకు విదేశాల్లో ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులో ఒకరు పోలీసుల ముందుకు వచ్చి సహకరిస్తేనే రాజకీయ నాయకుల పేర్లు బయటపడే అవకాశం ఉందని అప్పుడే రాజకీయ నేతలను పోలీసులు విచారణకు పిలుస్తారంటూ ముందు నుంచి ప్రచారం జరుగుతున్నది. కానీ అనుహ్యంగా ఆ ఇద్దరు విదేశాల్లోనే ఉన్నప్పటికీ పోలీసులు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అయితే ప్రబాకర్ రావు ఇచ్చిన వాంగ్మూలం, ఆధారాలతోనే పోలీసులు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## మా ఎమ్మెల్యేలు సమాధానం ఇస్తారు

### -మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి



చిరుమర్తి లింగయ్యకు పోలీసుల నోటీసుపై మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి స్పందించారు. కేవలం నిర్ధారణ కోసమే మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారన్న ఆయన దానికి అందరూ సమాధానం ఇస్తారని చెప్పారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని జగదీశ్వర్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. అయినా తామేం భయపడే వాళ్లం కాదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో అక్కడ ఎవరు గెలిస్తే మాకు ఏంటి...? ఓడితే మాకు ఏంటని ప్రశ్నించిన జగదీశ్వర్ రెడ్డి కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్‌లో బీజేపీ ఎందుకు విచారణ చేయడం లేదన్న జగదీశ్వర్ రెడ్డి రాష్ట్ర మంత్రిపై జరిగిన ఈడీ దాడుల వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

## నెల రోజుల్లో భూ సమస్యలు, కేసుల పరిష్కారానికి చర్యలు

### రాష్ట్ర షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**జనపదం, ఖమ్మం:** పెండింగ్ ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ భూ సంబంధిత కేసుల పరిష్కారానికి అవసరమైన నివేదికలు తెప్పించుకోవాలని, మొత్తం పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల వ్యవధిలోగా పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషన్ చైర్మన్ వెంకటయ్య జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కమిషన్ గౌరవ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అంగన్ వాడీ కేంద్రాలలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు వెళ్తారని, ఇక్కడ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎం.జి.ఎన్.ఆర్. జి.ఎస్. పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంగన్ వాడీ కేంద్రాలకు రూ.5 నుంచి 10 కోట్ల వరకు నిధులు పెట్టి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ అద్దె భవనాల్లో ఉన్న 300 అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయించుకోవాలని, డిసెంబర్ నెలలో ప్రారంభించి మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస రెడ్డి, అదనపు డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి సత్యనారాయణ, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేయాలి

### ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జనపదం, పెద్దపల్లి:** ధర్మారం మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి కలెక్టరేట్ లో కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ధర్మారం మండలంలోని ప్రభుత్వ భూముల సర్వే, ధాన్యం కొనుగోలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ధర్మారం మండలంలోని భూమి లేని నిరుపేదలకు అసైన్మెంట్ భూమి పంపిణీ చేసే దిశగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియను చేపట్టామని అన్నారు. ధర్మారం మండలంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ప్రభుత్వ విప్ తెలిపారు. ధర్మారం మండలం పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ప్రభుత్వ విప్ అధికారులకు సూచించారు. రైతులకు ఎక్కడ ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం కోత ఎక్కడ జరగడానికి వీలు లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యత ప్రమాణాలు పరిశీలించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఎప్పటికప్పుడు జరగాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గని సంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, హమాలీల కొరత ఎక్కడ రాకుండా చుట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణు, డీసీఓ శ్రీమాల, ఏడీ సర్వే శ్రీనివాస్,ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**జనపదం, భూదాన్ పోచంపల్లి :** 45 రోజులుగా మార్కెట్ యార్డులో నిలువ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కృషి చేసిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం రైతులు క్షిరాభిషేకం చేశారు. భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని గౌస్కొండ గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఏన్నం శివకుమార్, కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శనివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకొని జిల్లా కలెక్టర్ కి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో సబ్ కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారని, కేంద్ర ప్రభుత్వం ప్రతీ గింజను కొనుగోలు చేస్తానని హామీ ఇచ్చిన తర్వాత మీరు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించడంతో అదే రోజు సాయంత్రం జిల్లా కలెక్టర్ గౌస్కొండలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారన్నారు. మంత్రి కృషితో ధాన్యాన్ని కొనుగోలు చేయడం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మేకల చొక్కా రెడ్డి, దోసపాటి అంజయ్య, దేవేందర్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఫార్మాట్ మారాలి..!

- తెలంగాణలోలాగా దేశమంతా ట్వంటీ ట్వంటీ మ్యాచ్ ఆడాలి
- నేను కేసీఆర్‌కు ఫైనాన్స్ చేశా.. కానీ బీఆర్ఎస్ కు పని చేయలే..
- ఉద్యమాన్ని బీఆర్ఎస్ ఆర్థికంగా వాడుకుంది..
- కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతోంది..
- ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఖతం చేసేలా మోదీ పాలన
- త్యాగాల కాంగ్రెస్ వైపు జనం మొగ్గు చూపకపోవడం దారుణం
- దేశంలో పవర్ పాలిటిక్స్‌కు గాంధీ కుటుంబం దూరం
- 2014 నుంచి 2024 వరుసగా ఓడినా మైదానం వీడలేదు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి



**జనపదం, ఢిల్లీ :** దేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీ పాత మార్గాన్నే అనుసరిస్తోందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఫార్మాట్ ను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దేశంలో జూలు విదుల్చుతోన్న బీజేపీని అడ్డుకొని.. ఆ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాలంటే ఇది అనివార్యమన్నారు. ప్రస్తుతం తెలంగాణలో తాము ప్రతిపక్షాలతో ట్వంటీ ట్వంటీ మ్యాచ్ ఆడుతున్నామన్న సీఎం.. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ ఆడుతోన్న టెస్ట్ మ్యాచ్ కు చరమగీతం పాడి తెలంగాణ మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ జాతీయ వార్త సంస్థ నిర్వహించిన డిబెట్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలు పంచుకున్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ బీఆర్ఎస్ లో పని చేయలేదని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఆర్థిక తోడ్పాటు అందించానన్నారు. తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలో విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు ఉద్యమానికి మద్దతు ఇస్తే కేసీఆర్‌దాన్ని పెట్టుబడిగా మార్చుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత టీడీపీలో చేరి ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడితో కలిసి పని చేశానన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి గత బీఆర్ఎస్ పాలనలో గాడి తప్పిన ప్రజాస్వామ్యం పునరుద్ధరణ దిశగా ముందుకు వెళ్తున్నట్లు సీఎం చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ పది సార్లు సచివాలయానికి రాలేదన్న సీఎం నేను పది నెలల్లో ప్రతి రోజు సచివాలయానికి వెళుతున్నానని చెప్పారు. ఇప్పుడు కేసీఆర్ ప్రతిపక్షంలో ఉండి కూడా శాసనసభకు రావడం లేదన్నారు. పదేళ్ల కాలంలో ఎవరైనా ఇబ్బందులు, సమస్యలతో ధర్నా చేయాలనుకుంటే దానికి వీలు లేకుండా కేసీఆర్ ధర్నా చౌక్‌ను మూసి వేసి, పోలీసులను కాపాలా పెట్టారన్నారు. అయితే తాను సీఎం అయిన వెంటనే ధర్నా చౌక్ ను తెరిచి ప్రజాస్వామ్యాన్ని బతికించానన్నారు. ఇప్పుడు హరీశ్ రావు, కేటీఆర్ లు కూడా వారానికి రెండు సార్లు వచ్చి అక్కడ కూర్చొంటున్నారన్నారు. ప్రస్తుతం తెలంగాణ భవిష్యత్తు ఉదయిస్తోందన్న సీఎం ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమం.. అభివృద్ధి ఎజెండాగా పని చేస్తున్నట్లు వివరించారు. కేవలం సంక్షేమం చేపడితే అభివృద్ధి సాధ్యం కాదనీ కేవలం అభివృద్ధిపై దృష్టి పెడితే పేదలకు ఏం దక్కదన్నారు. ఈ రెండింటిని సమతుల్యం చేయడమే సుపరిపాలన అన్నారు.

**మోదీ ది వివక్ష పాలన..!**

2004 నుంచి 2014 వరకు యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ.. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా పని చేశారనీ, అదే సమయంలో నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నారన్నారు. అప్పట్లో మోదీ.. గుజరాత్ మోడల్ కు ప్రచారం చేసుకుంటే.. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుపడలేదన్నారు. ఆయనకు అవసరమైన అనుమతులు, బడ్జెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఖతం చేసేందుకు ఆయన స్థాయిలో ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఇది ఆయన గుజరాత్ మోడల్ అన్నారు. తమది తెలంగాణ మోడల్ అన్నారు. తెలంగాణలో పెట్టుబ డులు పెట్టేందుకు ఎవరైనా పెట్టుబడిదారు ప్రయత్నిస్తే గుజరాత్ వెళ్లమని ప్రధానమంత్రి కార్యాలయం చెబుతోందని ఆరోపించారు. దేశానికి ప్రధానిగా ఉండి కూడా మోదీ ఇప్పటికీ గుజరాత్‌కు ప్రధానమంత్రిలా భావిస్తున్నారన్నారు. అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అని గొప్పలు చెప్పుకుంటోన్న మోదీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లేకుండా అది ఎలా సాధ్యమవుతుందో చెప్పాలన్నారు. ఆర్థిక వ్యవస్థలో అగ్రభాగాన ఉన్న మహారాష్ట్రను ఆర్థిక రాజధానిగా అభివర్ణించిన సీఎం రాజకీయంగా రెండో స్థానంలో ఉండొచ్చన్నారు. కానీ ప్రధాని మోదీ మహారాష్ట్ర నుంచి 17 భారీ పెట్టుబడులు గుజరాత్‌కు తరలించారని ఆరోపించారు. ఇది సరైన విధానం కాదన్న రేవంత్ రెడ్డి.. ప్రధానమంత్రి జడ్జిలా వ్యవహరించాలన్నారు. తెలంగాణ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఫార్మాకు అనుకూలం.. ఐటీ, ఫార్మా పెట్టుబడులు పెట్టాలనుకునే వారు హైదరాబాద్ వైపు చూస్తారు. కానీ వారిని అహ్మదాబాద్ వెళ్లాలని ఒత్తిడి చేస్తే ఎలా..? ప్రశ్నించారు. ఇలాంటి సంకుచిత దృష్టి దేశానికి మంచిది కాదన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులకు మోదీ ఇద్దతు ఇస్తే ప్రతి రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఆరు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించగలమన్నారు. తెలంగాణలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పదేళ్లలో మోదీ ఈ దేశ ప్రజలను ఎలా మోసం చేశారో చెప్పగలిగామని సీఎం చెప్పారు. గత పదేళ్లు బీజేపీ సర్కార్ అన్నదాతలకు వ్యతిరేకంగా పని చేయడం. రాజ్యాంగం రద్దుకు మోదీ ప్రభుత్వం ఎలా ప్రయత్నించిందో చెప్పగలిగామన్నారు. అలాగే బీజేపీ రహస్య జెండాను బయటపెట్టామన్నారు. వాస్తవానికి బీజేపీ రహస్య అజెండా వేరు.. ఎన్నికల ముందు చెప్పే అజెండా వేరు అన్నారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయని గొప్పలు చెప్పుకున్న పార్టీ 240 సీట్లతోనే సరిపెట్టుకుందన్నారు. అదే సమయంలో 40 ఎంపీలున్న కాంగ్రెస్ వందకు చేరిందన్నారు. ఈ నెంబర్లు చూస్తే ఎవరు గెలిచారో తెలుస్తుందని చెప్పారు. ఇది బీజేపీ ఓటమి కాదనీ మోదీ ఓటమి అన్నారు. ప్రతి దానికి మోదీ ముద్ర వేశారు.. మోదీ గ్యారంటీ అన్నారు... మోదీ గ్యారంటీకి సంబంధించిన వారంటీ పూర్తయిందని తాను ఎన్నికలకు ముందే చెప్పానన్న సీఎం ఇప్పుడు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్‌లతో పాటు ఇంకొందరి సహకారంతో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నడుస్తోందన్నారు.

**పవర్‌పాలిటిక్స్ కు గాంధీ కుటుంబం దూరం..!**

దేశంలో పవర్ పాలిటిక్స్‌కు గాంధీ కుటుంబం దూరంగా ఉంటుందన్న సీఎం కాంగ్రెస్ కు జాతీయ దృక్పథం ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రాహుల్ గాంధీ ప్రభుత్వ వ్యవహారాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేదన్నారు. 2014 నుంచి 2024 వరుసగా మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినా ఆయన రాజకీయ మైదానాన్ని వీడలేదన్నారు. పైగా దేశ ప్రజల కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. మణిపూర్‌లో అల్లర్ల సమయంలో విద్వేష వీధుల్లో ప్రేమ దుకాణాలు తెరిచేందుకు తాను ప్రయత్నిస్తున్నానని రాహుల్ గాంధీ ప్రజలకు భరోసా కల్పించే ప్రయత్నంచేశారన్నారు. దానిపైనా బీజేపీ నేతలు వ్యంగ్య వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశాక ఆయన తుగ్లక్ రోడ్డు నుంచి ఇల్లు ఖాళీ చేశారనీ ఆ సమయంలో వేరే చోటుకు వెళ్లడానికి ఆయనకు ఇల్లు లేని విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో మూలమూలన ఉన్న ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయన్న సీఎం అదే ఇందిరమ్మ మనవడికి ఉండడానికి ఒక్క గది లేదన్నారు. పైగా బీజేపీ నేతలు గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి హోదాలో ఉన్న మోదీ ఆ రాష్ట్రం ఏటీఎం.. ఈ రాష్ట్రం ఏటీఎం అని అనడం ఆవేదన కలిగిస్తోందన్నారు. దేశం ఎవరి చేతిలో ఉండాలి..? ఎవరి పాలన కావాలో ప్రజలు ఇంకా తేల్చుకోలేకపోతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో సిద్ధాంతపరమైన రాజకీయాలా..? స్విగ్గీ రాజకీయాలా..? కూటమి ప్రభుత్వాలా..? ప్రభుత్వం ఏర్పడితే చాలా..ఎటు వెళ్లాలి అనేది సరైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో కొట్టిమిట్టాడుతున్నారన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలకు రీఓరియెంటేషన్ అవసరమన్న సీఎం తాత్కాలిక ఉపశమనం కోసం ప్రయత్నిస్తే.. దీర్ఘకాలిక ప్రయోజనాలు దక్కవనే విషయాన్ని గమనించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు సూచించారు.



## జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

- అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించుకోవాలి
- అనంతగిరి హిల్స్ లో పర్యాటక అభివృద్ధికి రూ. 100 కోట్లు మంజూరు
- దిశ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**జనపదం, వికారాబాద్ :** ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో, సమన్వయంతో వికారాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని దిశ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం చైర్మన్ కొండ విశ్వేశ్వర్ అధ్యక్షతన జరిగింది. దిశ వైస్ చైర్మన్ డీకే అరుణ , జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, చేవెళ్ల, తాండూర్ ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్ తో కలిసి చైర్మన్ కేంద్ర ప్రభుత్వం నుండి వివిధ శాఖలకు వచ్చే నిధులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను ఇస్తోందని, నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దిశ ప్రాముఖ్యతను గుర్తించి సమావేశంలో ప్రతిపాదించిన, చర్చించిన, పరిష్కార విషయాలను మూడు నెలలకో సారి సమీక్షించుకోవాల్సి ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు స్వచ్ఛ భారత్ కింద బాత్ రూమ్ లకు ప్రాధాన్యత కల్పిస్తూ కొత్త వాటికి ప్రతిపాదనలు ఇవ్వకుండా మరమ్మతులకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఉజ్వల పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిల్లోని పనులు చేపట్టాలని సూచించారు. పర్యాటక కేంద్ర అభివృద్ధికి రూ. 100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఇందులో భాగంగా అమృత్ పథకం కింద రైల్వే స్టేషన్ కు సంబంధించిన పనులకు కొంత నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చైర్మన్ సూచించారు. బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అమలు చేసేలా చూడాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. బోర్లు వేసి వాటిని మూసివేయక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు నీరు పడకుండంతో వదిలివేసిన బోర్లను వెంటనే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ కింద నిర్మాణాలు చేపట్టిన మరుగుదొడ్ల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ లకు పక్కా భవనాలు వుండేలా చర్యలు తీసుకోవాలని దిశ వైస్ చైర్మన్ డీకే అరుణ సూచించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్వాడీ భవనాలు పూర్తి చేయాలని ఆమె తెలిపారు. సమావేశంలో భాగంగా పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, ఉపాధి హామీ, విద్యుత్ , మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, భూగర్భ జలాలు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, నామినేటెడ్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్లు అధికారులు పాల్గొన్నారు.

## నాసిరకం మెడిసిన్ తయారుచేస్తే కఠిన చర్యలు

- రాష్ట్రంలో కొత్తగా 4 డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్
- డ్రగ్ ఇన్ స్పెక్టర్ల పోస్టులు భర్తీ
- అధికధరలకు విక్రయించే షాపులు, ఆసుపత్రులను సీజ్ చేస్తాం..
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



**జనపదం, హైదరాబాద్ ప్రతినిధి :** నాసిరకం, నకిలీ మెడిసిన్ తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చెప్పారు. నకిలీ మందులు విక్రదారులను ఏ మాత్రం ఉపేక్షించవద్దని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులకు ఆయన సూచించారు. ఫార్మా ఇండస్ట్రీస్, డ్రగ్ మానుఫాక్చరింగ్ యూనిట్స్, మెడికల్ హాల్స్, ఫార్మసీలలో మరింత విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఫార్మా సంస్థలు ఉన్న చోట అదనంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలన్నారు. . డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో కంప్లైంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులతో హైదరాబాద్ లోని వెంగళరావునగర్‌లో ఉన్న డీసీఏ కార్యాలయంలో మంత్రి దామోదర రాజ నర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఒక్కటే ఉందని, దీనివల్ల ఎక్కువ సాంపిల్స్‌ను టెస్ట్ చేయలేకపోతున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన ఈ ల్యాబ్ లో నెలకు గ రిష్టంగా 400 సాంపిల్స్ మాత్రమే పరీక్షించగలుగుతున్నామని వివరించారు. 2014 నాటికి సుమారు 20 వేల మెడికల్ షాపులు ఉంటే, ఇప్పుడు 45 వేలకు పెరిగాయని.. కానీ, గత పదేండ్లలో కొత్తగా డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ రాలేదని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచలేదన్నారు. హైదరాబాద్ లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ ఆధునీకరణ, కొత్తగా 4 ల్యాబ్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మషల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయా లని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం 71 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారని, కనీసం 150 మంది అవసరం అని అధికారులు మంత్రికి తెలిపారు. సీ తో చర్చించి అవసరమైనమేర పోస్టులు మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను వారు పనిచేస్తున్న ఏరియాకే పరిమితం చేయొద్దని, ర్యాండమ్‌గా ఇతర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పరిధిలోని సంస్థల్లో తనిఖీలకు పంపించాలని డీజీ కమలాసన్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, డీఎంహెచ్‌వోలతో కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు. మెడిసిన్ ధరలు, నాణ్యత విషయంలో నిబంధనలు ఉల్లంఘించే హస్పిటళ్ల సమాచారాన్ని డీఎంహెచ్‌వోలకు అందజేయాలని, ఆయా హస్పిటళ్లపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. హాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌ను(మత్తును కలిగించే మెడిసిన్) విచ్చలవిడిగా అమ్ముతున్నవారిపై నిఘా పెట్టాలని మంత్రి రాజనర్సింహా సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లకు పంపిణీ చేసే మెడిసిన్ కొనుగోలు విషయంలో టీజీఎంఎస్ఐడీసీకి అవసరమైన సహకారాన్ని డీసీఏ అందించాలని మంత్రి సూచించారు. టీజీఎంఎస్ఐడీసీకి మెడిసిన్ సరఫరా చేసే సంస్థల మానుఫాక్చరింగ్ యూనిట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, ర్యాండమ్‌గా మెడిసిన్ సాంపిల్స్ సేకరించి టెస్ట్ చేయాలని ఆదేశించారు. మెడిసిన్ ప్రొక్యూర్‌మెంట్‌కు ముందు తర్వాత కూడా ఈ ప్రక్రియ కొనసాగించాలన్నారు. నిబంధనలు పాటించకపోయినా, నాసిరకం మెడిసిన్ అని తేలినా, ఆయా సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. టీజీఎంఎస్ఐడీసీ పరిధిలో ఉండే సెంట్రల్ మెడికల్ స్టోర్స్‌ను కూడా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, అక్కడ మెడిసిన్ సరియైన విధానంలో భద్రపరుస్తున్నారో, లేదో చెక్ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు నాణ్యమైన మెడిసిన్ అందించేలా డీసీఏ, టీజీఎంఎస్ఐడీసీ చర్యలు ఉండాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, డీసీఏ జాయింట్ డైరెక్టర్ జి.రాందాన్ తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి



- చదువుతో పాటు సాంకేతిక రంగాల్లో రాణించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, సిద్దిపేట (హుస్నాబాద్ ) :** విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛంధ సస్థల సహకారంతో ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లిష్ ల్యాబ్, మొబైల్ యాప్ ను మంగళవారం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రోబోటిక్ ల్యాబ్ సోహం అకాడమి సహకారంతో, కంప్యూటర్ ల్యాబ్ నిర్మాన్ సంస్థ సహకారంతో, సైన్స్ ల్యాబ్ ఇన్ఫినిటీ వైద్య ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోబోటిక్ ల్యాబ్ లో మినీ రోబోలు ,సెన్సార్ లతో తయారు చేసిన అధునాతన పరికరాలను మంత్రి పరిశీలించారు. సైన్స్ ల్యాబ్ లో పెరిస్కోప్ , డిజిటల్ మైక్రో స్కోప్ , డ్రోన్, టెలిస్కోప్ , న్యూటన్ క్రడల్ , మోటార్ డేయాన్స్టేషన్, మానవ శ రీరంలో ఉండే అవయవాలు, హైడ్రో టర్బన్స్ తదితర 75 రకాల యాక్టివిటీస్ పరిశీలించారు. నిర్మాణ ఓ ఆర్జీ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ డిజిటల్ క్లాస్ , డిజిటల్ బోర్డ్స్, సీసీ కెమెరాలు మొత్తం 20 కంప్యూటర్ లు ప వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్ లో పెరుగుతున్న సాంకేతిక గురించి సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ను ఉపయోగించుకోవాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ల్యాబ్ లు ఏర్పాటు చేశారని ,వారికి తన పక్షాన, విద్యారుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. హుస్నాబాద్ లో ఉన్న అన్ని స్కూళ్లలో ఈ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తామన్నారు. సిద్దిపేట లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఉంటుందని కాంపిటీషియన్ లో హుస్నాబాద్ నుండి ప్రతి స్కూల్ పాల్గొనాలని సూచించారు. జెడ్పీహెచ్ ఎస్ హుస్నాబాద్ పేరు మీద యాప్ డౌన్లోడ్ చేసుకుని, పాఠశాల కార్యక్రమాలు తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. పాఠశాలకు కొటెక్ మహేంద్ర సంస్థ వారు రూ.25 లక్షలతో నిర్మించడానికి ముందుకు వచ్చిందన్నారు. 14 నుంచి డిసెంబర్ వరకు ఉదయం, సాయంత్రం స్టేడియంలో యోగా క్లాస్ లు నిర్వహిస్తారని, అందరూ ఉపయోగించుకోవాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయిలో ఆటలు ఆడిన వారికి మంత్రి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. హుస్నాబాద్ బాయ్స్ పాఠశాల నుండి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన ఆశ్వద్ విద్యార్థిని అభినందించారు.

## అప్పులు చేసి చిప్ప చేతికిచ్చారు..

- బీఆర్ ఎస్ పై మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజం
- గోవర్ధనగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**జనపదం, వనపర్తి :** తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు ఇచ్చామని బీఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటని, అప్పుల కుప్ప చేసి చిప్ప చేతికి ఇచ్చారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. వనపర్తి జిల్లా గోవర్ధనగిరిలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న విలువైన రింగ్ రోడ్డు ను 30 సంవత్సరాలకు లీజు కు ఇచ్చి రైతులకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. గత పాలకులు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ కట్టడమే సరిపోతుందని, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నట్లు తెలిపారు. నేను మాట్లాడిన మాటలు నిజం కాదని బీఆర్ఎస్ నాయకులు నిరూపిస్తే రాజకీయం నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కొన్ని రోజులు ఆలస్యమైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని అయినా కూడా గత ప్రభుత సంక్షేమ పథకాలను వేటిని కూడా రద్దు చేయకుండా ప్రజలకు మంచి జరిగే పథకాలను అందిస్తున్నామని అన్నారు. రైతు భరోసా పథకం కొంత ఆలస్యమైనా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు నియోజకవర్గాల్లో మాత్రమే కొందరికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చి రాష్ట్రమంతా ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, రైతు రుణమాఫీ, గృహ జ్యోతి పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, పానగల్ మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బాల్ రెడ్డి, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ఏత్తం కృష్ణయ్య, నాయకులు నారాయణరెడ్డి, చక్ర వెంకటేష్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## కేసుల మాఫీకే కేటీఆర్ ఢిల్లీ టూర్

- అయినా అక్కడ ఆయన్ను ఎవరూ దేఖరు..
- అర్హత లేని వారికి అమృత్ టెండర్లు ఇచ్చింది వారే
- మేం టెండర్లు పిలిస్తే ప్రభుత్వానికి రూ. 65 కోట్లు మిగిలాయి
- కవిత, సృజన్ రెడ్డి వ్యాపార భాగస్వాములు
- ఢిల్లీలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**జనపదం, న్యూ ఢిల్లీ :** అమృత్ టెండర్ల అక్రమాలపై గవర్నర్ విచారణ నుంచి బయటపడేందుకే బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్‌కేటీఆర్‌ఢిల్లీకి వెళ్లారని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అయినా ఆయన్ను అక్కడ ఎవరూ దేఖరు అంటూ ఎద్దేవా చేశారు. మంగళవారం ఢిల్లీలో మంత్రి మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్లు అర్హత లేని వాళ్లకు ఇచ్చింది కేటీఆర్ అన్న మంత్రి వాటిని తానే రద్దు చేయాలని చెప్పానని గుర్తు చేశారు. తాము టెండర్ పిలవడంతో ప్రభుత్వానికి రూ. 65 కోట్లు మిగిలాయన్నారు. అ మృత్ టెండర్ల లో కేటీఆర్ చేసిన అవినీతి ఆరోపణ ఉత్తదేనని ఆయన కొట్టిపడేశారు. కవిత, సృజన్‌రెడ్డి లు వ్యాపార భాగస్వాములని., పాలమూరు టన్నెల్ పనులను చేసింది వారేనని గుర్తు చేశారు. అందుకు కేటీఆరే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్రాస్ ఓటింగ్‌తో బీజేపీకి లాభం చేకూర్చిందన్న కోమటిరెడ్డి ఆ విషయాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని కేటీఆర్ బీజేపీతో టచ్ లోకి వెళ్లారని కామెంట్ చేశారు. రీ టెండర్ ద్వారా ప్రభుత్వానికి మేలు జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కేటీఆర్ నగరానికి తెచ్చింది ఒరిజినల్ ఫార్ములా-1 కాదని మంత్రి ఎద్దేవా చేశారు. ఈ రేసింగ్ లో.. కంపెనీ కి పాండ్స్ లోకి మార్చి నిధులు మళ్లించారని అది నేరమన్నారు. ఆ అక్రమంలో ఎక్కడ జైల్ కి వెళ్తానో అనే భయం కేటీఆర్ కు పట్టుకుందని మంత్రి చెప్పారు. అమృత్ స్కీమ్ లో ఆయన.. ఇచ్చిన కంపెనీ ఎవరిది..? అని ప్రశ్నించిన కోమటిరెడ్డి.. ప్రతిమా.. గజా కంపెనీలు కేసీఆర్ సన్నిహితులవే కదా ? అని నిలదీశారు. తన అవినీతి బయటకు వచ్చిందని గ్రహించిన కేటీఆర్ తాను జైలుకు పోవాల్సి వస్తుందనే భయంతో ఆ ఇష్యూను డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ మీద దాడి చేసింది బీఆర్ఎస్ కార్యకర్తే అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాల్పడిన అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణను వేగవంతం చేసిందని.. కేటీఆర్‌ను విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరుతూ లేఖ రాసిందని తెలిపారు. కేసుల నుంచి బయటపడేందుకే బీజేపీ నాయకులతో రహస్యంగా ములాఖత్ కోసం కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు.

## నాలుగు నెలల్లో ఏఐ సిటీ నిర్మాణం

- పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం
- గ్లోబల్ లాజిక్ సాఫ్ట్ వేర్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**జనపదం, మాదాపూర్ :** రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఏఐ రంగం భారీ పురోభివృద్ధి సాధిస్తుందని, నాలుగు నెలల్లో ఏఐ సిటీ నిర్మాణం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని మాదాపూర్ లో గ్లోబల్ లాజిక్ సాఫ్ట్ వేర్ ఆఫీసును ప్రారంభించిన ఆయన అక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న నాలుగు నెలల్లో పీపీపీ విధానంలో ఏఐ సిటీ నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. తెలంగాణలో పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్నిరకాల సహాయ సహకారాలను అందిస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ నగరం అన్ని రకాల పెట్టుబడులకు అనుకూలంగా ఉందనీ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కూడా ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి,యువతకు ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు 12శాతంగా ఉన్నాయని, వాటిని వచ్చే ఐదే ళ్లలో 20శాతానికి చేర్చడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. మలేషియాలో స్థిరపడిన తెలుగు పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని మంత్రి బు పేర్కొన్నారు.

## కారు బైక్ ఢీకొని ఇద్దరి మృతి

**జనపదం, కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డే కొత్తపల్లి బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పెద్ద వంగర మండలం గంట్లకుంట శివారు అమర్ సింగ్ తండాకు చెందిన జాటోత్ శాంతమ్మ, వెంకన్న బైకుపై వస్తుండగా కారు ఢీకొట్టడంతో ఘటనస్థలిలోనే చనిపోయారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.







# కుల గణనపై విమర్శలు మానాలి

## ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హితవు

**జనపదం, కరీంనగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనపై ప్రతిపక్షాలు విమర్శలతో రాద్ధాంతం చేస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. కులగణనకు ఎవరూ సాహసించని తరుణంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడమే కాకుండా కుల గణన చేస్తోందన్నారు. కుల గణన చేపట్టడాన్ని స్వాగతించకుండా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు హేతుబద్ధత లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో గెలవడం కోసమేనని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించడాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి తప్పుబట్టారు. మహారాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఆగమేఘాలపైన కుల గణన చేయిస్తున్నామనడంతో కేటీఆర్ కు రాజకీయ పరిపక్వత లేదని తేలిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. యాస, ప్రాసలతో నోటికేది వస్తే అది మాట్లాడితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని, ఆ నమ్మకం లేకనే ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కేటీఆర్ గుర్తించుకోవాలన్నారు. కుల గణన సర్వేపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి విమర్శించారు. ఆ పార్టీ నాయకుల మాటల్లోనూ వైరుధ్యాలున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను మహారాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ధర్మపాల్ మేష్రామ్ ఆ పార్టీ నాగ్‌పూర్ సభలో స్వాగతిస్తున్నట్టు ప్రకటించగా, తెలంగాణ కమలనాథులు మాత్రం కుల గణనపై విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కుల వివక్ష, కుల వ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయనే సోయి ప్రతిపక్షాలకు లేకపోవడం విచారకమని ఆయన పేర్కొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ చీకటి బంధం..

## అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టం.. సీఎం రేవంత్ రెడ్డి



**జనపదం, బ్యూరో:** గవర్నర్ ఇచ్చే అనుమతి నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి బంధం బయటపడుతుందన్నారు. కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పాల్పడిన అవినీతికి సంబంధించి విచారణ మొదలైందని, విచారణకు సమాధానం చెప్పకుండా ఎదురుగా దాడికి దిగుతున్నారన్నారు. సృజన్ రెడ్డి ఉపేందర్ రెడ్డి అల్లుడని, ఉపేందర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సృజన్ రెడ్డికి వేలకోట్ల పనులు ఇచ్చారని, అమృత్ పథకం గురించి ఇష్టం వచ్చిన చోట చెప్పుకోమనండి అని ఎద్దేవా చేశారు.

**కావాలనే ఆరోపణలు..**

కేటీఆర్ కుటుంబం దోచుకున్న విషయాలు చర్చించకుండా ఉండడానికి నా మీద ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ రెడ్డి అయినా నాకు దూరంగానో దగ్గరగానో నాకు బంధువు అవుతారన్నారు. రెడ్డిలు అయినంత మాత్రాన నా బంధువులనో నేను వర్క్స్ ఇచ్చా అనో అంటే సరికాదని హెచ్చరించారు. కేటీఆర్ చెప్పినట్లు ఉంటే న్యాయపోరాటం చేయాలని, బీజేపీ అవినీతి పార్టీ అనే బీఆర్ఎస్ వారి వద్దకు వెళ్లి లేఖలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు మెదడు కోల్పోయారని, వారి గురించి జాలిపడటం తప్ప చేసేది ఏమి లేదన్నారు.



# కాపాడు దేవుడా..

- పాపాత్ముడు రేవంత్ రెడ్డిని క్షమించు..
- మూసీ కంటే రేవంత్ నోటి కంపు ఎక్కువ
- రైతుల సీఎం కేసీఆర్.. బూతుల సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ లేకుంటే ఉద్యమం లేదు
- రేవంత్ కి సీఎం పదివే లేదు..
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్డుమీదకి వచ్చిండ్రు..
- ప్రజలు ప్రశాంతతను కోల్పోయారు..
- సీఎం పగ ప్రతీకారం పక్కనపెట్టి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- సంజయ్ యాత్రకు సంఘీభావం..



**జనపదం, జగిత్యాల :** కొండగట్టు అంజన్న.. వేములవాడ రాజన్న.. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి.. కోటి లింగేశ్వర స్వాములపై ప్రమాణం చేసి మోసం చేసిన రేవంత్ రెడ్డిని ఆ దేవుళ్ళు క్షమించారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ చేపట్టిన రైతు పాదయాత్రలో హరీష్ రావు పాల్గొన్న రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ కొండగట్టు అంజన్న పై ప్రమాణం చేసి మోసం చేసిన వారు బ్రతికి బట్ట కట్టరని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బాండ్ పేపర్లు రాసిచ్చి, పార్లమెంట్ ఎన్నికల్లో ముందు దేవులపై బొట్టుపెట్టి మాట తప్పని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్ర చేపట్టారని ఇది ట్రైలర్ మాత్రమేనని ముందు 70 ఎం ఎం చూపిస్తామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఒక హామీ కూడా అమలు చేయలేదని.. ఎన్నికల ముందు 10 వేలు ఇస్తామంటే అడ్డుకొని మేము వచ్చాక 15 వేలు ఇస్తామని ఇంతవరకు రూపాయి కూడా ఇవ్వలేదు అన్నారు. నీవు ఇస్తానన్న పదిహేను వేలు ఎప్పుడు ఇస్తావు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.

**శాపం కావొద్దు..**

పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తా అని సిఎం రేవంత్ రెడ్డి రాజన్న మీద ఒట్టు వేసి మాట తప్పిండు ,పాలకుడే పాపం చేస్తే రాష్ట్రానికి అరిష్టమవుతుంది, అది ప్రజలకు శాపం అవుతుంది,రేవంత్ రెడ్డి చేసిన పాపం రాష్ట్ర ప్రజలకు శాపం కావద్దని వేములావాడ రాజన్నను మొక్కుకున్నా అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీ రు హరీష్ రావు అన్నారు. మంగళవారం వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు దర్శించుకున్నారు. స్వామివారికి కోడమొక్కును చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో రైతులు ఇప్పటికే తీవ్ర నష్టాల పాలవుతున్నారన్నారు. ఇప్పటివరకు రైతులకు రైతుబంధు ఇవ్వలే, రైతులకు ఇచ్చే రైతు బంధు ఎగ్గొట్టిండు, యాసంగి పంటకు అయినా రైతు బంధుఇచ్చేలా చూడు అని దేవుణ్ణి కోరుకున్నాఅని అన్నారు.దేవుళ్ల మీద ఓట్లు పెట్టిన మాట తప్పింది సి ఎం రేవంత్ రెడ్డి అని,భయం లేదు, కనీసం భక్తి కూడా లేదు అన్న అనుమానం వస్తున్నది అని అన్నారు.





కేసీఆర్ మీద మాట్లాడే నైతికత కాంగ్రెస్ నాయకుల కి లేదు అని కేసీఆర్ లేకుంటే ఉద్యమం లేదు, రాష్ట్రం లేదు, నువ్వు సిఎం అయ్యే వాడివి కాదు అని అన్నారు. కేసీఆర్ అన్న మాటలో తప్పు ఏం ఉంది అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు ఏమి కోల్పోయారు చెప్పడానికి నేను సిద్దమని, తెలంగాణ ప్రజలు ఏం పొందారో చెప్పడానికి సి ఎం రేవంత్ రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. రేవంత్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చారు అని, ఇప్పటికైనా పగా, ప్రతీకారం మాని సీనియర్లను పరిగణనలోకి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన చేయాలని అన్నారు.

తెలంగాణ కోసం పోరాడింది పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ,కెసిఆర్ వందేళ్ళ అభివృద్ధి చేస్తే, రేవంత్ ఏడాది కాకముందే వందేళ్ల వెనుకకు రాష్ట్రాన్ని తీసుకు పోయే ప్రయత్నం చేస్తున్నాడు అని అన్నారు.రాష్ట్రం మీద, పరిపాలన మీద దృష్టి పెట్టి, రైతు బంధు ఖాతాల్లో వేయాలని,ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాల్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీ నరసింహారావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జడ్పీ చైర్పర్సన్లు తులా ఉమా,అరుణ రాఘవరెడ్డి, నాయకులు లక్ష్మణరావు, దేవిశ్రీ ప్రసాద్, ఏనుగు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో అధికార దుర్వినియోగం

- ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే డబ్బులు..
- తెలంగాణ, కర్ణాటకలో ఆర్ ఆర్ ట్యాక్స్ వసూల్
- ఇక్కడ మోసం చేసినట్టే.. మహా రాష్ట్రలో కూడా..
- ముంబై ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో పూర్తిగా అధికార దుర్వినియోగానికి కాంగ్రెస్ సర్కార్ పాల్పడుతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. ఏడాదిగా ప్రభుత్వం నడుపుతోన్న కాంగ్రెస్ పచ్చి అబద్ధాలతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పచ్చి అబద్దాలు చెప్పారని ఆయన అన్నారు. ఈ మేరకు మంగళవారం ముంబైలో బీజేపీ తరపున ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత ఎలా మోసం చేస్తోందో మహారాష్ట్ర ప్రజలకు వివరించానన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ లూటీ చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లూటీ చేస్తోందని ఆయన ఆరోపించారు, కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మవద్దని మహారాష్ట్ర ప్రజలను ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీకి బాధ్యత లేదని, దాదాపు రూ.8 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారాయన్నారు. ఆర్ ఆర్ ట్యాక్స్ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో గెలిచిన తర్వాత దేశంలో ఏ ఎన్నికలు జరిగినా.. తెలంగాణ సర్కారు ఏటీఎం ద్వారా.. డబ్బులు తెచ్చి మిగిలిన చోట్ల ఖర్చుపెడుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. మేనిఫెస్టోలో మొదటి పేజీలోని పథకాలే అమలుచేయలేని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు. మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని భావిస్తే బహిరంగ చర్చకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధమా? అని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.

# తొలిపోరుకు సిద్ధం

- జార్ఖండ్‌లో మొదటి విడుత పోలింగ్
- నవంబర్ 20 తేదీ రెండో విడత..
- 81 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎలక్షన్ కమిషన్



**జనపదం, న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7 గంటలకు ఇక్కడ పోలింగ్ ఆరంభం కానుంది. సవ్యంగా సాగడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకుంటున్నారు. మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 44. ప్రస్తుతం ఇక్కడ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా అధికారంలో ఉంది. జార్ఖండ్ ముక్తి మోర్చా–కాంగ్రెస్–వామపక్షాల ప్రభుత్వానికి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నాయకత్వాన్ని వహిస్తోన్నారు.

నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతలుగా జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీఏ, ఇండియా కూటమి. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి జేఎంఎం–కాంగ్రెస్– వామపక్షాలు ఈ సారి అధికారంలోకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరాలని ఎన్డీఏ ప్రయత్నాలు సాగిస్తోన్నాయి. మొత్తంగా 2.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 1.31 కోట్ల మంది పురుషులు, 1.29 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 11.84 లక్షల మంది తొలి సారిగా ఓటు వేయనున్నారు. వీరిలో యువ ఓటర్ల సంఖ్య 66.84 లక్షలు.

**నేడు తొలిదశ..**

తొలి దశలో 43 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగనుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ సహా మొత్తం 683 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్నారు. వీరిలో 73 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. తొలి విడతలో 15, 344 మంది పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది ఈసీ. ఈ విడతలో మొత్తం 1,36,85,508 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 68,65,207 మంది పురుషులు, 68,20,000 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ విడతలో మెజారిటీ సీట్లను దక్కించుకోవడానికి జేఎంఎం– కాంగ్రెస్, బీజేపీ సంకీర్ణ కూటమి పార్టీలు హోరాహోరీగా ప్రచార పర్వాన్ని సాగించాయి. బీజేపీ నుంచి దినేషానంద్ గోస్వామి (బహరాగోరా), బాబూలాల్ సోరెన్ (ఘట్‌శిల), పూర్ణిమా సాహు (జంషెడ్‌పూర్ ఈస్ట్), చంపై సోరెన్ (సరైకేలా), గీతా గోరా (జగన్నాథ్‌పూర్), సుదర్శన్ భగత్ (గుమ్లా), మీనా ముండా (పొట్కా) వంటి అభ్యర్థులు తొలి విడతలో బరిలో నిలిచారు. జార్ఖండ్ ముక్తి మోర్చా నుంచి రామ్‌దాస్ సోరెన్ (ఘట్‌శిల), బైద్యనాథ్ రామ్ (లతెహర్) దీపక్ బారువా (చాయ్‌బాసా), మిథిలేష్ కుమార్ ఠాకూర్ (గర్వా), మహువా మాఝీ (రాంచీ) వంటి హేమాహేమీలు తొలి విడత పోలింగ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునే వారిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి డాక్టర్ అజొయ్ కుమార్ (జంషెడ్ పూర్ ఈస్ట్), రామేశ్వర్ ఓరమ్ (లోహర్‌దాగా), జేడీయూ అభ్యర్థి సరయూ రాయ్ (జంషెడ్‌పూర్ వెస్ట్) బరిలో ఉన్నారు.



# పత్తి ధర పతనం..

- రైతుల మండిపాటు
- మార్కెట్ సందర్శించిన కలెక్టర్
- అధికారులపై ఆగ్రహం
- రైతుకు అన్యాయం చేయాలనుకోవడం సరికాదని హితవు..
- చర్యలకు వెనకాడబోమని హెచ్చరిక..

**జనపదం, ఖమ్మం :** పత్తి ధర మరోసారి పతనమైంది. వ్యాపారుల మాయాజాలం, మార్కెట్ అధికారుల ఉదాసీనత రైతులను నష్టపరుస్తుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కు సుమారు 50 వేల పత్తి బస్తాలు రావటంతో అంతా తెల్ల బంగారంతో మెరిసింది. రెండు రోజుల సెలవులు అనంతరం ప్రారంభం కావటంతో రైతులు పెద్దఎత్తున సరుకు తెచ్చారు. మంగళవారం ఎంఎస్పీ క్వింటా పత్తి ధర రూ.7,521 నిర్ణయించారు. సోమవారం కూడా ఎంఎస్పీ ధర కంటే తక్కువ రేటుకు వ్యాపారులు కొనుగోల్లు చేశారు. దీంతో మంగళవారం రైతులు తమకు సరైన ధర రావడం లేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మార్కెట్ ను ఆకస్మికంగా సందర్శించారు. దీంతో రైతులు తమ ఆవేదన ను వ్యక్తం చేశారు. వ్యాపారుల ధోరణి , మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 నుంచి 14 తేమ శాతం ఉన్నప్పటికీ ఎమ్మెస్పీ ధర చెల్లించేందుకు మార్కెట్ అధికారులు చొరవ చూపాలన్నారు. 20 నుంచి ఆ పైన తేమ ఉంటే తాము ఏం చేయలేమని ధర తగ్గుతుందన్నారు. 9 తేమ శాతం ఉన్న ఓ రైతు వద్ద క్వింటా పత్తి రూ.6800 ధర చెల్లించడంపై కలెక్టర్ అసంతృప్తి చేశారు. తేడా ధర రైతుకు చెల్లించే విధంగా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల పక్షాన ఉండి ఎమ్మెస్పీ ధర వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలని, వ్యాపారుల వైపు ఉండటం సరికాదని కలెక్టర్ తీవ్రస్థాయిలో మార్కెట్ అధికారులను మందలించారు. క్రమశిక్షణ చర్యలకు వెనకాడ బోనని స్పష్టం చేశారు.

**ప్రైవేటు వ్యాపారులకు నోటీసులు జారీ..**

నిబంధనలను పరిశీలించకుండా రైతులను మోసం చేస్తూ కొనుగోలు చేయడాన్ని కలెక్టర్ తీవ్రంగా తప్పుపట్టారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలని, ఒక రెండు రోజులు ఆరబెట్టుకొని వస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపాలని, లేదా పంట ఇప్పుడే అమ్మాలంటే నిబంధనల ప్రకారం ధర చెల్లించాలని, ఇష్టానుసారం తేమ శాతం పరిశీలించకుండా కొనుగోలు చేయడానికి వీలు లేదని కలెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసే ప్రతి పంట ప్రక్రియను మార్కెటింగ్ అధికారులు నిరంతరం పరిశీలించాలని, రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలని, తేమ శాతం దానికి అనుగుణంగా ఉండే ధర వివరాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులకు ఆదేశించారు. రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకు పంట కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని, తేమ శాతం ప్రకారం రైతులకు ధర చెల్లించని పక్షంలో లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. మార్కెట్ యార్డులో అవసరమైతే అదనంగా పది మంది సిబ్బందిని తేమ శాతం పరిశీలనకు విధులలో చేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com